E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 07-05-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:125 || పేజీలు–6
www.ekaburu.com

## తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ




03



03

### మళ్లీ ట్రంప్ బెదిరింపులు

**ఈ-కబురు, వాషింగ్టన్:** ఇరాన్‌పై బాంబులేసి యుద్ధాగ్ని జ్వాలల్ని రాజేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ అదే పాట పాడారు.



03

### కోల్‌కతా సమీపంలో కాల్పులు.. సువేందు అధికారి పీఏ హత్య

**ఈ-కబురు, కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి భగ్గుమన్నాయి. ఉత్తర 24 పరగణాల జిల్లా



03

### రైతు చేతుల్లో దండన తప్పదు

పథకాల్లో కోతలు.. ఎగవేతలు తప్ప.. ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు
కనీసం కల్లాల్లో పంటల్ని కూడా కొనకుండా గోస పెడుతున్నారు
కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లో డబ్బులు.. ఇప్పుడు రాహుల్ ఖాతాలో..
వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో




# తమిళనాట సస్పెన్స్ థ్రిల్లర్

గంట గంటకూ మారిన రాజకీయ సమీకరణలు
విజయ్‌కు సీఎం కుర్చీ దక్కకుండా ద్రవిడ పార్టీల అనూహ్య ఎత్తుగడ!
బద్ధవ్యతిరేక డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు!!
అంతా వట్టిమాటలే అంటూ కొట్టేసిన ప్రధాన పార్టీలు
మేజిక్ ఫిగర్‌తో వస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఒప్పుకుంటానని విజయ్‌ను తిరిగి పంపేసిన గవర్నర్.. ఎత్తుకు పైఎత్తులతో రసకందాయంలో తమిళనాడు కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ

**ఈ-కబురు, చెన్నై:**

**వందకు పైగా స్థానాల్లో గెలిచిన టీవీకే చీఫ్ విజయ్ మరో డజనుమంది ఎమ్మెల్యేల మద్దతుతో ఖచ్చితంగా సీఎం కుర్చీపై కూర్చుంటారని అంతా భావిస్తున్న వేళ తమిళనాట పెను సంచలనాల పర్వానికి తెరలేచింది. గంట గంటకూ ఊహించని మలుపులతో అధికార పీఠం చివరికి ఎవరి పరమవుతుందో ఎవరూ చెప్పలేని అనూహ్య పరిస్థితి ఏర్పడింది.**

కలలో కూడా ఊహించనట్లుగా బద్ధ వ్యతిరేక డీఎంకే, అన్నాడీఎంకేలు ఏకమైపోయి సీఎం కుర్చీని తన్నుకుపోతాయన్న వార్త ఇప్పుడు యావత్ తమిళనాట సంచలనం సృష్టిస్తోంది. బయటి ఎమ్మెల్యేల మద్దతుతో ఎలాగోలా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయొచ్చని గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు ఊహించని పరిణామాలు ఒకదాని వెంట మరొటి వచ్చిపడి ఊపిరాడనివ్వట్లేవు. అధికారమే పరమావధిగా మీ రెండు పార్టీలు పొత్తు పెట్టుకోబోతున్నాయా అన్న ప్రశ్నకు డీఎంకే, అన్నాడీఎంకేలు 'లేదు'అనే సమాధానిస్తున్నాయి. కానీ రహస్యంగా రెండు పార్టీల మధ్య విస్తృతస్థాయిలో మంతనాలు జరుగుతున్నాయని తమిళనాడు మీడియాలో వార్తలు షికార్లుచేస్తున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే ఉమ్మడిగా వచ్చి ప్రభుత్వం ఏర్పాటుచేస్తామంటే గవర్నర్ అర్లేకర్ సరేనంటారా లేదంటే అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీకే తొలి ప్రాధాన్యత ఇస్తానంటారా? అనే విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. ఇలాంటి సందిగ్ధావస్థలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు అనే అంశంపై స్పష్టత కోసం న్యాయ నిపుణులతో గవర్నర్ సమావేశమయ్యారు. న్యాయ నిపుణులను లోక్ భవన్‌కు పిలిపించి, సుదీర్ఘంగా చర్చలు జరపడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాత్రి పదిన్నరగంటలదాకా ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది.



మిగతా 2లో

# మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపండి

ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి
ఎయిర్‌పోర్ట్–ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్–3 కింద చేపట్టండి
ఇప్పటికే డీపీఆర్ సమర్పించామని వెల్లడి
కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



**ఈ-కబురు, న్యూఢిల్లీ:**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి ఇప్పటికే డీపీఆర్‌ను సమర్పించినట్లు తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, ఫేజ్-3పై చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ లో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశంతో మెట్రో ఫేజ్-1ను ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఫేజ్-2ను భారత ప్రభుత్వం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ - భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కూడా ఇప్పటికే సమర్పించామని తెలిపారు.

మిగతా 2లో

# భారత్, వియత్నాం మధ్య సమగ్ర వ్యూహాత్మక ఒప్పందం

4 ఏళ్లలో 25 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం!
వియత్నాం అధ్యక్షుడితో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు




**ఈ-కబురు,న్యూఢిల్లీ:**

ఇరుదేశాల మధ్య వచ్చే నాలుగేళ్లలో 25 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్యమే లక్ష్యంగా భారత్, వియత్నాం మరో అడుగు ముందుకేశాయి. మూడ్రోజుల భారత పర్యటనలో భాగంగా మంగళవారం ఢిల్లీకి చేరుకున్న వియత్నాం అధ్యక్షుడు టో లామ్ బుధవారం హైదరాబాద్‌హౌస్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాల అగ్రనేతలు వాణిజ్యం, రక్షణ, అరుదైన మూలకాలు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

మిగతా 2లో

## రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు..
# 17వ ఎస్ఐపీబీ ఆమోదం

విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్
సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్
కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు
తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ
రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం...
39 వేల మందికి ఉద్యోగాలు
నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం
సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం



**ఈ-కబురు,,అమరావతి, మే 06:**

రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది.

వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.

మిగతా 3లో



నాకోసం వాహనదారులను
# ఇబ్బంది పెట్టవద్దు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన**
**డీజీపీకి ఆదేశాలు**

**ఈ-కబురు,హైదరాబాద్, మే 6:**

తన పర్యటనల సమయంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలపవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి డిజిపి సివి ఆనంద్ కు సూచించారు. ముఖ్యమంత్రి బుధవారం నాడు ఢిల్లీ వెళ్తున్న క్రమంలో విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోవడం పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ముఖ్యమంత్రి వాహనాలు వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా ఆపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిజిపి కి ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మిగతా 2లో

## ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం
# మన ఖర్మ



- ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ప్రభుత్వం పట్టించుకోవట్లేదు
- ఫీజుల నియంత్రణ చట్టం ఈ నెలలోనే తేవాలి
- 1200 మంది బలిదానాలతో వచ్చిన తెలంగాణలో 12 ఏళ్లుగా ఆ సంవేదనతో పాలన సాగలేదు
- ఉచిత విద్య, వైద్యం మా పార్టీ విధానం
- మాట తప్పితే అమరవీరుల స్థూపం వద్ద రాళ్లతో కొట్టండి
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత

**ఈ-కబురు,హైదరాబాద్ :**

రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా ఫెయిల్ అయ్యిందంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత ఆరోపించారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ విద్య సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రే మన విద్యాశాఖ మంత్రి కావటం ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 3లో

# కేటీఆర్ ఓ 420..



కేటీఆర్ ది దొంగల బ్యాచ్ ; పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

02

## టీటీడీ కీలక నిర్ణయాలు
# ధూపదీప నైవేద్యాల పెంపు

03

అలిపిరిలో యాగశాల, 'అక్షర గోవిందం' ప్రారంభానికి సిద్ధం



## ధాన్యం కొనుగోళ్లపై
# భారాసది గోబెల్స్ ప్రచారం

కాంగ్రెస్ హయాంలోనే జాతీయ రికార్డు దిగుబడి, కొనుగోళ్లు
ప్రస్తుత రబీ సీజన్‌లో రూ.21,501 కోట్ల విలువైన ధాన్యం కొంటాం
పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్



02

## మెట్రో ఫేజ్–2కు ఆమోదం తెలపండి



ఈ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్వీఎస్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**కేరళలో మోదీ, అమిత్‌షాలను ఓడించాం: సీఎం**

**– వాళ్లకు ఒక్క సీటే దక్కింది**

తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా కేరళలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వచ్చిన ఆయన విమానాశ్రయంలో విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు స్పందించారు. 'కేరళలో కాంగ్రెస్ విజయం సాధించింది. అక్కడ రాహుల్, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు నరేంద్ర మోదీ, అమిత్‌షాలను ఓడించారు. వాళ్లకు అక్కడ ఒక్క స్థానం మాత్రమే దక్కింది. అదీ వాళ్ల పని తీరు..'అంటూ ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు.

## నాకోసం వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దు



ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో డీజీపీ సి.వి. ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే మాట్లాడాల్సి రావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందని, క్షేత్రస్థాయి అధికారులు దీనిని గంభీరంగా పరిగణించాలని డిజిపి సివి ఆనంద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్టం చేసేందుకు అడిషనల్ డిజిపి ఆధ్వర్యంలో త్వరలోనే 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నామని ప్రస్తుతం విధివిధానాలను రూపొందిస్తున్నామని డిజిపి సివి ఆనంద్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి సత్వర నిర్ణయాలు తీసుకోవాలని, సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని డిజిపి సివి ఆనంద్ సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ లేకుండా చూడాలని, ఐఎస్ డబ్ల్యూ, సీఎస్ డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతల విభాగం అధికారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు . ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనార్, సైబరాబాద్ సిపి ఎం. రమేష్, మల్కాజిగిరి సిపి బి. సుమతి, ఫ్యూచర్ సిటీ జాయింట్ సిపి చందనా దీప్తి, రైల్వేలు మరియు రోడ్డు సేఫ్టీ ఐజిపి రమేష్ నాయుడు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, ఐఎస్డబ్ల్యూ ఓఎస్డి కమలాసన్ రెడ్డి, సిఎంఎస్జి ఎస్పీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు..!

## కేటీఆర్ ఓ 420..



**ఈ-కబురు,హైద్రాబాద్ మే 6:**

కేటీఆర్ ఓ 420..కేటీఆర్ ది దొంగల బ్యాచ్ అని పీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. బుధవారం గాంధీ భవన్ లో పిసిసి వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీష్ తో కలిసి మాట్లాడారు.పాస్ పోర్ట్ కుంభకోణం మొదలై భూముల కుంభకోణం వరకు కేటీఆర్ కుటుంబమే ఉంది.కేటీఆర్ నీ స్థాయి ఏంటి... నువ్వా రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి ని విమర్శించేది.ఉద్యమం లో దొంగచాటుగా వచ్చిచేరి..కేకే మహేందర్ రెడ్డి గొంతు కోసావు.యువతను మద్యానికి అలవాటు చేసి రాష్ట్ర భవిష్యత్ ను బిఆర్ఎస్ నాశనం చేసిందని దుయ్యబట్టారు.ఏం చేసారని ఒకే కుటుంబం లో ఉన్న వారందరికీ పదవులు..దళితుడిని ముఖ్యమంత్రి చేయకుంటె తలనరుక్కుంటా అన్నారు... కేసీఆర్ కు ఇప్పుడు తల ఉందా లేదా..బిఆర్ఎస్ హాయాం లొ జరిగిన ఆగడాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు కేటీఆర్. మాదకద్రవ్యాల ప్రభావం తో కేటీఆర్ ఇలామాట్లాడుతున్నారనే అనుమానం ఉంది.బండిసంజయ్ పిట్టల దొరలా మారడు.సీబీఐకి కేసు అప్పగిస్తే పొడిచేస్తామన్నారు...6 నెలలుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.జాతీయ స్థాయి రాజకీయాలు వేరు.. రాష్ట్ర స్థాయిలో రాజకీయాలు వేరు.జాతీయ స్థాయిలో సీపీఎం తో దోస్తీ కొనసాగుతుంది.కేరళ స్థాయిలో సీపీఎం తో పోరాటం ఉంటుంది. తమిళనాడు లో డీఎంకే తో ఎన్నికలకు వెల్లినా ఆ రాష్ట్ర పరిస్థితుల నేపథ్యంలోనే టీవికే కు మద్దతు ఇచ్చామని స్పష్టం చేశారు.

## 'తమిళనాట' సస్పెన్స్ థ్రిల్లర్



**ద్రవిడ పార్టీల మధ్య కుదరని సయోధ్య!**

విజయ్ పార్టీకి అధికారం దక్కకుండా చేయడమే లక్ష్యంగా ద్రవిడ పార్టీలు రహస్య చర్చలు జరిపాయని మీడియాలో వార్తలొచ్చాయి. డీఎంకే, అన్నాడీఎంకే ప్రతినిధుల బృందాలు లోతైన చర్చలు జరిపాయని తెలుస్తోంది. తాము ప్రభుత్వం ఏర్పాటుచేస్తామని అన్నాడీఎంకే ఆఫర్ చేయగా అందుకు డీఎంకే సమ్మతి తెలిపిందని, కానీ బయటి నుంచి మద్దతు ఇస్తామని డీఎంకే వెల్లడించినట్లు వార్తలొచ్చాయి. ప్రభుత్వంలో చేరితే ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని అన్నాడీఎంకే ఆఫర్‌చేసినట్లు తెలుస్తోంది. అందుకే ససేమిరా ఒప్పుకోబోమని, తప్పదనుకుంటే ప్రతిపక్షంలోనే కూర్చుంటామని డీఎంకే తెగేసి చెప్పడంతో అర్ధంతరంగా చర్చలు ముగిశాయని వార్తలొచ్చాయి.

**118 మంది మద్దతుతో వస్తే చూస్తాం: గవర్నర్**

అంతకుముందు బుధవారం ఉదయం నుంచి తమిళనాట పలు నాటకీయ పరిణామాలు సంభవించాయి. మంగళవారం రాత్రే మీకు మద్దతిస్తామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పేర్లను జతచేసి టీవీకే చీఫ్ విజయ్ తన కీలక పార్టీ నేతలతో కలిసి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు లోక్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిశారు. విజయ్ వెంట టీవీకే ముఖ్యనేతలు బస్సీ ఎన్ ఆనంద్, ఆధవ్ అర్జున, కేఏ సెంగొట్టయాన్, సీటీ నిర్మల్‌కుమార్ తదితరలు ఉన్నారు. టీవీకే పార్టీలో 108 మంది ఎమ్మెల్యేలున్నా విజయ్ రెండుచోట్ల గెలవడంతో ఆ సంఖ్య 107కు తగ్గింది. వీళ్లకు కాంగ్రెస్‌లోని ఐదుగురి పేర్లను జతచేసి మొత్తం 112 పేర్లజాబితాను గవర్నర్‌కు విజయ్ సమర్పించి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. అందుకు గవర్నర్ సమ్మతి తెలపలేదు. 118 మంది ఎమ్మెల్యేలతో స్పష్టమైన మెజార్టీ వచ్చాక తిరిగి తన వద్దకు రావాలని విజయ్‌కు గవర్నర్ సూచించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించారు. దీంతో నిరాశతో విజయ్ వెనుతిరిగారు.

**మొదలైన మలుపుల పర్వం**

ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించలేదన్న వార్త తెలీగానే అప్పటిదాకా ప్రమాణస్వీకారం కోసం స్టేడియంలో జరుగుతున్న సన్నాహక ఏర్పాట్లు హఠాత్తుగా ఆగిపోయాయి. అయితే కాంగ్రెస్‌కుతోడుగా అన్నాడీఎంకే సైతం టీవీకేకు మద్దతు పలకనుందనే వార్త వెనువెంటనే చక్కర్లు కొట్టింది. దీనిని అన్నాడీఎంకే కొట్టిపారేసింది. ''ఇది పూర్తిగా అబద్ధం. ఏ రకంగా చూసినా మేం విజయ్ పార్టీకి మద్దతు ఇవ్వబోం. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆదేశానుసారమే మా 47 మంది ఎమ్మెల్యేలు నడుచుకుంటారు''అని పార్టీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ కేపీ మునుస్వామి స్పష్టంచేశారు. తాము సైతం డీఎంకే కూటమికే మద్దతు ఇస్తామని సీపీఐ(ఎం), సీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) ఎమ్మెల్యేలు బుధవారం స్పష్టంచేశారు. అంతకుముందు సీపీఐ(ఎం), సీపీఐ, ఐయూఎంఎల్ ఎమ్మెల్యేలు డీఎంకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి స్టాలిన్‌ను కలిశారు. మీ వెంటే ఉంటామని మాటిచ్చారు. అయితే గురువారం సమావేశమై టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వాలా వద్దా అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని డీఎంకే మిత్రపక్షమైన విదుథలై ఛిరుథైగల్ కట్చి(వీసీకే) చీఫ్ థోల్ తిరుమవాలన్ ప్రకటించారు. ''మద్దతు ఇవ్వాలని విజయ్ మమ్మల్ని కోరారు. పార్టీ ముఖ్యులతో మాట్లాడాక ఏ విషయమైనా చెప్పగలను''అని తిరుమవాలన్ వ్యాఖ్యానించారు. వీసీకేకు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారు.


**మద్దతిస్తూ ముందుకొచ్చిన కాంగ్రెస్**

బుధవారం చెన్నై పనయూరులోని టీవీకే కార్యాలయానికి తమిళనాడు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గిరీశ్ చోడంకర్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతొగై, ఏఐసీసీ నేత ప్రవీణ్ చక్రవర్తి నేతృత్వంలోని బృందం వెళ్లింది. వీరికి పుష్పగుచ్చాలతో విజయ్ బృందం ఆహ్వానం పలికింది. ఈ సందర్భంగా తమ పార్టీ తరపున గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు సంతకాలతో కూడిన లేఖను విజయ్‌కు కాంగ్రెస్ నేతలు అందజేశారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల దాకా తమ మధ్య పొత్తు కొనసాగాలని, మతతత్వ పార్టీలను చేర్చుకోవద్దని కాంగ్రెస్ షరతు విధించింది. కాంగ్రెస్ మహిళా నేతకు మంత్రి పదవి ఇవ్వాలని కోరింది.

**నాన్చుడి ధోరణి మానుకోవాలి..**

ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకుండా గవర్నర్ నాన్చడమేంటని కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మండిపడ్డారు. ''బలనిరూపణ అనేది శాసనసభలో చేస్తారు. లోక్‌భవన్‌లో కాదు. లోక్‌భవన్‌లోనే 118 సంఖ్య చూపించాల్సిన అవసరం లేదు. ఇకనైనా గవర్నర్ మాటున బీజేపీ రాజకీయాలుచేయడం మానుకోవాలి. తక్షణం గవర్నర్ విజయ్‌ను మళ్లీ పిలిచి వెంటనే బలనిరూపణకు అవకాశమివ్వాలి''అని జ్యోతిమణి డిమాండ్‌చేశారు.

**ఏం జరగొచ్చు!!**




టీవీకే, కాంగ్రెస్ కలిస్తే?

కనీసం 118 మంది ఎమ్మెల్యేలున్న కూటమి మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగలదు. ఇక్కడ టీవీకే పార్టీలో 107 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీళ్లకు కాంగ్రెస్‌లోని ఐదుగురు కలిస్తే బలం 112కు పెరుగుతుంది. వీసీకే, సీపీఐ, సీపీఎంలోని తలో ఇద్దరు ఎమ్మెల్యేలు అంటే ఆరుగురు వీళ్లకు జతకలిస్తే మొత్తం బలం 118కి పెరుగుతుంది. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయొచ్చు.

**టీవీకే, అన్నాడీఎంకే కలిస్తే?**

అన్నాడీఎంకేలోని 47 మంది ఎమ్మెల్యేలు జతకూడితే టీవీకే బలం 154కు పెరుగుతుంది. ఇప్పటికే మద్దతిచ్చిన ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలనూ లెక్కలోకి తీసుకుంటే మొత్తం బలం ఏకంగా 159కి పెరుగుతుంది. అప్పుడు సునాయసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయొచ్చు.

**ద్రవిడ పార్టీలు దగ్గరైతే?**

డీఎంకే, అన్నాడీఎంకే కలిసినా ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశాలున్నాయి. డీఎంకేలోని 59, అన్నాడీఎంకేలోని 47 మందికి తోడు ఇరుపార్టీల మిత్రపక్షాలు తోడు వస్తే ఇది సాధ్యం. పీఎంకే(4), ఐయూఎంఎల్(2), సీపీఐ(2), సీపీఎం(2), ఏఎంఎంకే(1),డీఎండీకే(1) ఎమ్మెల్యేలు కలిస్తే మొత్తం బలం 120కి పెరుగుతుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా మద్దతు లభిస్తుంది.

**మొదలైన రిసార్ట్ రాజకీయాలు**

తమ ఎమ్మెల్యేలను కాపాడుకునే క్రమంలో డీఎంకే, అన్నాడీఎంకేలు తమ సభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అన్నాడీఎంకే ఎమ్మెల్యేల్లో పాతిక మందిని పుదుచ్చేరిలోని ఓ రిసార్ట్‌కు బుధవారం రాత్రి 11.30 గంటలకు తరలించారు. సీనియర్ నేత సీవీ షణ్ముగం నేతృత్వంలో ఈ ఎమ్మెల్యేలు రిసార్ట్‌కు వెళ్లారు. సీ వీషణ్ముగం ఉదయం టీవీకేతో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేద్దామిన అన్నాడీఎంకే అధిష్టానంపై ఒత్తిడి తీసుకు రావడం గమనార్హం. డీఎంకే ఎమ్మెల్యేలూ పుదుచ్చేరి సమీప రిసార్ట్‌కు వెళ్లినట్లు వార్తలొచ్చాయి.

**విజయ్‌కు భద్రత మాయం!**

విజయ్‌కు మంగళవారం, బుధవారం తమిళనాడు పోలీసులు గట్టి భద్రత కల్పించారు. గవర్నర్‌ను ఆయన కలిసే సమయంలోనూ తమిళనాడు ప్రభుత్వం ఉపయోగించే కాన్వాయ్ వెంటరాగా సొంత వాహనంలోనే లోక్‌భవన్‌కు వెళ్లివచ్చారు. అయితే బుధవారం రాత్రి 11.15 గంటల సమయంలో మాత్రం విజయ్ పట్టినంబాక్కం నివాసం నుంచి నీలాంకరై ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో ఆయనకు ఉదయం కల్పించిన కాన్వాయ్ భద్రత లేదు. అదనపు భద్రతను తొలగించారని తెలుస్తోంది. తనకు అదనపు భద్రత అక్కర్లేదని విజయ్ చెప్పడంతోనే ప్రభుత్వం కాన్వాయ్‌ను ఉపసంహరించుకుందని టీవీకే వర్గాలు పేర్కొంటున్నాయి.

## భారత్, వియత్నాం మధ్య సమగ్ర వ్యూహాత్మక ఒప్పందం



డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, అరుదైన భూఅయస్కాంతాలు, ఫార్మాసూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సాంస్కృతిక సంబంధాలకు సంబంధించి మొత్తంగా 13 ఒప్పందాలపై సంతకాలుచేశారు. దక్షిణ చైనా సముద్రంపై చైనా ఆధిపత్యం పెరగడంతో ఇండో-పసిఫిక్‌లో మారుతున్న పరిణామాలపై ఇరుదేశాధినేతలు చర్చించుకున్నారు. ప్రాంతీయ శాంతి, సుస్థిరతకు కట్టుబడి ఉన్నామని నేతలు పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. ''దశాబ్ద కాలం క్రితమే ఆసియాన్ కూటమి నుంచి భారత్‌కు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామిగా మారిన తొలి దేశం వియత్నాం. ఈ పదేళ్లలో మన రెండు దేశాల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. అవి ఇప్పుడు విస్తృతస్థాయి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఎదిగాయి. భవిష్యత్తులో ఈ బంధాన్ని సమున్నత శిఖరాలకు చేరుద్దాం. సాంస్కృతిక సంబంధాలు మొదలు అనుసంధానత, సామర్థ్యం పెంపు, భద్రత, సుస్థిరాభివృద్ధి, సరఫరా గొలుసుల పటిష్టత దాకా ప్రతిరంగంలో సమన్వయం పెంచుకుంటూ సమున్నత స్థాయికి ఎదుగుదాం. 2030 ఏడాదినాటికి 25 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్య సామర్థ్యం సాధిద్దాం''అని మోదీ అన్నారు.

**మా ద్రాక్ష రుచి చూస్తారు..**

''ఇకపై భారతీయ ఔషధాలు వియత్నాంవాసులకూ అందుబాటులోకి వస్తాయి. భారతీయ వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్య ఉత్పత్తులు, పశుసంబంధ ఉత్పత్తులు ఇప్పుడు వియత్నాం ప్రజలకు చవగ్గా దొరకనున్నాయి. భారతీయ ద్రాక్ష, దానిమ్మ రుచిని త్వరలోనే వియత్నాంవాసులు రుచి చూడబోతున్నారు. ఇండియా-ఆసియాన్ వాణిజ్య ఒప్పందాన్ని ఈ ఏడాది చివరికల్లా నవీకరిస్తాం. అరుదైన మూలకాలు, భూఅయస్కాంతాలు మొదలు ఇంధనరంగంలో సహకాం ద్వారా కీలక వాణిజ్యం, పెట్టుబడుల్లో సరస్పర సహకారాన్ని మరింత పెంపొందిస్తాం. ఇరుదేశాల కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని పెంచుతాం. ఇండియాలో అమలవుతున్న యూపీఐ పేమెంట్ వ్యవస్థను, వియత్నాంలోని పాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో అనుసంధానిస్తాం. ఇరుదేశాల రాష్ట్రాల మధ్య, నగరాల మధ్య సైతం అనుసంధానం రెట్టింపుకానుంది''అని మోదీ అన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై భారాసది గోబెల్స్ ప్రచారం



ఈకబురు,హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలోనే తెలంగాణలో రికార్డుస్థాయి ధాన్యం దిగుబడి, కొనుగోళ్లు జరుగుతుంటే తట్టుకోలేక భారాస గోబెల్స్ ప్రచారం చేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస అధికారంలో ఉన్న 202324 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో రూ.10,415 కోట్ల విలువైన ధాన్యం కొంటే, 202526 రబీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా రూ.21,501 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో వరి సాగు, దిగుబడి, కొనుగోళ్లను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంతో పోలుస్తూ సచివాలయంలో బుధవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ, లోక్‌సభ, గ్రామపంచాయతీ, మున్సిపల్.. ఇలా వరుస ఎన్నికల్లో ప్రజలు భారాసను దారుణంగా ఓడించినా ఆ పార్టీ నేతల తీరు మారలేదని విమర్శించారు. రైతుల్ని గందరగోళపరిస్తే ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో మళ్లీ గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

**కేటీఆర్‌వి అర్థంలేని ఆరోపణలు**

ధాన్యం కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ నుంచి తీసుకుంటున్న రుణంపై కేటీఆర్ అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ''మార్క్‌ఫెడ్ కూడా ప్రభుత్వరంగ సంస్థే. అది మరో ధాన్యం సేకరణ ఏజెన్సీ. భారాస హయాంలో ఒక్కో బస్తా వడ్లపై మిల్లర్లు, వ్యాపారులు, మూణ్నాలుగు కిలోల తరుగు తీసినా చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం తాలు, తరుగు పేరుతో కిలో కోత పెట్టినా మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రంలో ఇప్పుడున్నది రైతు ప్రభుత్వం.. అన్నదాతలకు నష్టం కలిగించే ఏ చర్యనూ కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థించదు. ప్రతి గ్రామంలో చివరి రైతు వరకు.. రాష్ట్రంలో చివరిగింజ వరకు వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వర్షాలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందవద్దు. తడిసిన వడ్లను బాయిల్డ్ కోటా కింద రైస్‌మిల్లులకు పంపిస్తాం. ప్రతి కేంద్రానికి వాతావరణ సమాచారాన్ని ముందస్తుగా పంపిస్తున్నాం. ఏ కొనుగోలు కేంద్రంలోనైనా ఏ రైతుకైనా ఇబ్బంది వస్తే.. సివిల్ సప్లైస్ భవన్‌లోని కంట్రోల్ రూమ్ 1967కు ఫోన్ చేయండి. స్పందించి సమస్యను పరిష్కరిస్తాం. దేశంలో ధాన్యం ఉత్పత్తిలో, కొనుగోళ్లలో, రైతులకు మద్దతు ధర చెల్లింపుల్లో.. ఇలా అన్నింటా దేశంలో నంబర్‌వన్ తెలంగాణే. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే 17.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేసి రైతులకు రూ.2,310 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వంలో లబ్ధిపొందిన రైతుల సంఖ్య 7.6 లక్షలైతే ఇప్పుడు ఏకంగా సుమారు 80 శాతం పెరిగి 13 లక్షలకు చేరుకుంది. కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలపైనా భారాస తప్పుడు ప్రచారం చేస్తోంది. ముందెన్నడూ లేనిరీతిలో వసతులు కల్పించాం. వర్షాలకు తడిసి పోకుండా టార్పాలిన్లు సహా అనేక ఏర్పాట్లు చేశాం. రైతులు నిరీక్షించకుండా ప్రత్యేక టోకెన్లు జారీచేస్తున్నాం. ఆ సమయానికి రైతులు వస్తే సరిపోతుంది. దాహార్తి తీర్చేందుకు వీలుగా మంచినీటి సరఫరా, ఓఆర్ఎస్ ప్యాకెట్ల సరఫరా చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాలలో రైతులు చనిపోతే తక్షణమే పరిహారం అందిస్తున్నాం'' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ




ఈకబురు,హైదరాబాద్ :
రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా ఫెయిల్ అయ్యిందంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత ఆరోపించారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ విద్య సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రే మన విద్యాశాఖ మంత్రి కావటం ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈనెలలోనే ఫీజు నియంత్రణ చట్టం తేవాలి**

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లో అరికట్టాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫీజు నియంత్రణ కోసం తక్షణమే చట్టం చేయాల్సిందేనని అన్నారు. ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఫీజు పెంపు లేకుండా జీవో జారీ చేయాలన్నారు. ఫీజుల పెంపు కారణంగా తల్లితండ్రులకు మే నెల పీడకల మాదిరిగా తయారైందన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే 60 నుంచి 70 శాతం వరకు వారి ఆదాయాన్ని ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలన్న తల్లితండ్రుల వీక్‌నెస్ ను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ సంస్థలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రైవేట్ స్కూల్ లో దాదాపు 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. తాము కొత్తగా ఏమీ అడగటం లేదని...రేవంత్ రెడ్డి సర్కార్ గతంలో ఇచ్చిన హామీలనే అడుగుతున్నామన్నారు.

**ఫీజు రీయింబర్స్ మెంట్ ను బొందపెట్టే జీవో నం.7**

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టకపోగా...ఫీజు రీయింబర్స్ మెంట్ ను కూడా బొందపెట్టే కుట్ర ఈ ప్రభుత్వం చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్7 జీవో తో ఫీజు రీయింబర్స్ మెంట్ కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పిల్లల అకౌంట్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ వేస్తామంటూ జీవో లో పేర్కొన్నారని కవిత చెప్పారు. ఫీజు అకౌంట్ లో వేయకపోయిన సరే పిల్లల తల్లితండ్రులు ఉద్యమం చేయరన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పనిచేస్తుందన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్ లో ఉన్న రూ. 11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. బకాయిలు చెల్లించకపోవటంతో కాలేజ్ లు మూతపడుతున్నాయన్నారు. పైగా చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోతే అధికంగా నష్టపోయేది ఆడపిల్లలేనని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. చదువుల భారం ఎక్కువైతే కొడుకుల కంటే ముందు కూతుళ్లనే చదువు మాన్పించే పరిస్థితి వస్తుందన్నారు. ఈ విధంగా ప్రభుత్వం ఆడబిడ్డల భవిష్యత్ ను అంధకారంలోకి నెట్టేస్తుందన్నారు.

**హెచ్ పీఎస్ లో అవినీతి చర్యలేవీ?**

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్ పీఎస్) లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని కవిత అన్నారు. ఈ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్ పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిందని చెప్పారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగే స్కూల్లోనే ఈ పరిస్థితి ఉంటే...చైతన్య, నారాయణ లాంటి స్కూళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా అదే పదవిలో కొనసాగుతూ, కొత్తగా వచ్చే వారికి అవినీతి పాఠాలు నేర్పుతున్నారన్నారు. సత్య నాదెళ్ల వంటి పూర్వ విద్యార్థులు ఇచ్చిన విరాళాలకు సంబంధించి ఎలాంటి లెక్క పత్రం లేని పరిస్థితి ఉందన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారన్నారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాళ్లతో కొట్టండి**

విద్య, వైద్యం కోసమే తెలంగాణలో ప్రతి కుటుంబం 70 శాతం ఖర్చు చేసే పరిస్థితి ఉందని కవిత అన్నారు. 1200 మంది అమరుల ప్రాణ త్యాగం చేసి...ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని రాష్ట్రాన్ని సాధించారని కవిత గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఒక సంవేదనతో పాలన చేయాల్సి ఉండేనని చెప్పారు. కానీ ఆ పని జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ కోసం తిరుపతి రావు కమిషన్ వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం...ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ పై ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం అందించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావిస్తే వాటిని ఉచితంగా అందించడం సాధ్యమేనని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యత నుండి తప్పుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన (TRS) అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో కూడా పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని మరోసారి తేల్చి చెప్పారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు.

# తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ

ఈకబురు, హైదరాబాద్:
తెలంగాణలో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం భర్తీ చేసింది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.
బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బస్వరాజు శ్రీనివాస్. వాషర్‌మెన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ దాసరిరాజు అజయ్ కుమార్. గీతకార్మికుల కార్పొరేషన్ ఛైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, పెరిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ దొంగారి వెంకటేశ్వర్లు. మేర సహకార కార్పొరేషన్ ఛైర్మన్ సంగా వెంకటరాజం.
వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గట్టు తిమ్మప్ప
మున్నూరు కాపు సహకార కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్‌యాదవ సహకార కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.రఘునాథ్ యాదవ్
వడ్డెర సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గుంజ రేణుక నారాయణ
చేనేత అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ దూదెం వెంకట రమణ
కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్
పద్మశాలి సహకార కార్పొరేషన్ ఛైర్మన్ గూడూరు శ్రీనివాస్
భట్టరాజ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఛైర్మన్ సీహెచ్ బాలరాజు
వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ జువ్వాది నర్సింగ్‌రావు
గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ ఛైర్మన్ కొల్లె సరిత
లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్‌తెలంగాణ తెలుగు అకాడమీ ఛైర్మన్ ప్రొ.వెంకటనారాయణ
తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ ఛైర్మన్ సూదిని రామిరెడ్డిగ్రామపంచాయతీ ట్రిబ్యునల్ సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసా వేణుగోపాల్‌ను నియమించారు.

# టీటీడీ కీలక నిర్ణయాలు

తిరుపతి, మే 06 ఈకబురు,న (ప్రతినిధి)
తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఛైర్మన్ బి.ఆర్ నాయుడు అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యాలు, సనాతన ధర్మ ప్రచారం, విద్యా-వైద్య సేవల విస్తరణకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్రంలోని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5,000ను రూ.10,000కు పెంచాలని నిర్ణయించారు. అలాగే సనాతన ధర్మ ప్రచారం కోసం “అక్షర గోవిందం” కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. తిరుపతిలో అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం శాశ్వత యాగశాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.తిరుమలలో భక్తుల సౌకర్యాల దృష్ట్యా ఆళ్వార్ ట్యాంక్ అతిథి గృహం సర్కిల్ నుండి బాట గంగమ్మ సర్కిల్ వరకు ఉన్న సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించనున్నారు. తిరుమలలోని రోడ్లు, సర్కిళ్లకు ఆధ్యాత్మిక, పురాణ ప్రాశస్త్యం కలిగిన పేర్లు పెట్టాలని నిర్ణయించారు.టీటీడీ విద్యాసంస్థల అభివృద్ధికి అదనంగా రూ.43.40 కోట్లు మంజూరు చేసి, మొత్తం రూ.161.40 కోట్లు కేటాయించారు. నీటి వృథాను అరికట్టేందుకు గోగర్భం డ్యామ్ నుండి ఫిల్టర్ ప్లాంట్ వరకు రూ.6 కోట్లతో అదనపు పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు.టీటీడీ అవసరాల కోసం రూ.44.20 కోట్లతో పట్టు వస్త్రాలు, దుప్పట్లు కొనుగోలు చేయాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా వర్ధనపల్లి గ్రామంలో శివాలయ నిర్మాణానికి రూ.55 లక్షలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. తమిళనాడులోని శెట్టిపాళ్యం గ్రామంలో టీటీడీకి రిజిస్టర్ చేసిన 19.43 ఎకరాల భూమిని విలీనం చేసుకోవడానికి ఆమోదం తెలిపారు.నవీ ముంబైలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా సంప్రోక్షణకు అవసరమైన సిబ్బందిని కాంట్రాక్ట్/ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ముంబైలో పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఖర్చును ఒక బోర్డు సభ్యుడు భరించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. తిరుమలలో వరాహస్వామి విశ్రాంతి భవనం-1లో రూ.3.61 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గుంటూరు జిల్లా అనంతవరంలో రూ.2.71 కోట్లతో రాజగోపురం నిర్మాణం, అమరావతిలో వెంకటపాలెంలో రూ.36.95 కోట్లతో మహా రాజగోపురం సహా పలు నిర్మాణాలకు ఆమోదం తెలిపారు.పాలనా సౌలభ్యం కోసం తిరుమలలో అన్ని కార్యాలయాలను ఒకేచోట కలిపే విధంగా నూతన పరిపాలనా భవనం నిర్మాణం చేపట్టనున్నారు. సత్యసాయి జిల్లా లేపాక్షిలో కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి ఆమోదం తెలిపారు.టీటీడీ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్‌లో భాగంగా రీఎంబర్స్‌మెంట్ పరిమితిని రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు శ్రీవారి దర్శనం, లడ్డూ కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు
.అలిపిరి టోల్ గేట్ వద్ద వాహన రద్దీ తగ్గించేందుకు రూ.4.25 కోట్లతో శాశ్వత షెల్టర్లు ఏర్పాటు చేయనున్నారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పొందుతున్న వినికిడి లోపం గల 150 మంది పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు
అందించనున్నారు.ఈ సమావేశంలో ఈవో జె. శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు.. 17వ ఎస్ఐపీబీ ఆమోదం



**ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలి**

రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని...కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దుష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమన్నది చాటి చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం**

సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపిబి సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో...ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి. మన రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలి. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుంది" సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

**17వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనల వివరాలు**

**ఇంధన రంగం**

1.రిలయన్స్ ఇండస్ట్రీస్ శ్రీసత్యసాయి జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు రూ.51,300 కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగాలు
2.క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రీడ్ త్రీ లిమిటెడ్, నంద్యాలలో రూ.155 కోట్ల పెట్టుబడులు, 40 మందికి ఉద్యోగాలు
3.క్లీన్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వెల్వ్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు, 125 మందికి ఉద్యోగాలు
4.క్లీన్ ఎనర్జి హైబ్రీడ్ థర్టీన్ లిమిటెడ్ అనంతపురం జిల్లా రూ.779 కోట్ల పెట్టుబడులు 125 మందికి ఉద్యోగాలు
5.అదాని హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ కడప జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రూ. 12,297 కోట్ల పెట్టుబడులు, 3375 మందికి ఉద్యోగాలు
6.యమాన్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లాలో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్ల పెట్టుబడులు, 5820 మందికి ఉద్యోగాలు
7.అమృత శ్రీ బయో సీఎన్జీ లిమిటెడ్ విజయనగరం రూ.89 కోట్ల పెట్టుబడులు, 402 మందికి ఉద్యోగాలు
8.బాలాజీ బయోఎనర్జీ ఆర్గానిక్స్, నెల్లూరు జిల్లా రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
9.హెచ్ పీసీఎల్ రెన్యూబుల్ గ్రీన్ ఎనర్జీ, ఏలూరు జిల్లా రూ.100 కోట్ల పెట్టుబడులు, 150 మందికి ఉద్యోగాలు
10.ఎనర్జియా బయో ఫ్యూయల్స్ తిరుపతి జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.59 కోట్ల పెట్టుబడులు, 335 మందికి ఉద్యోగాలు
11.విభా బయో ఫ్యూయల్స్ తూర్పుగోదావరి జిల్లా రూ.67 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు
12.ఐఓసీ జీపీఎస్ రెన్యువబుల్స్ ఎన్టీఆర్ జిల్లాలో సీబీజీ ప్లాంట్ రూ.120 కోట్లు పెట్టుబడులు, 200 మందికి ఉద్యోగాలు,
13.డెల్టా బయోగ్యాస్ పలనాడు జిల్లా రూ. 100 కోట్లు పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగాలు

ఐటీ

14.రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు రూ.1,08,010 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
15.క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, తిరుపతి జిల్లాలో బల్క్ చిల్లర్స్ తయారీ రూ.863 కోట్ల పెట్టుబడులు, 721 మందికి ఉద్యోగాలు.
16.ఎన్ఎస్టీఎల్ డీఆర్డీఓ, అమరావతి క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్ల పెట్టుబడి, 20 మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్

17.స్నేహా ఫార్మ్స్ లిమిటెడ్ అనంతపురం, అన్నమయ్య జిల్లాలు, రూ,277.94 కోట్ల పెట్టుబడులు, 435 మందికి ఉద్యోగాలు

పరిశ్రమలు

18.గ్రైడోన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లా, రూ.3149 కోట్ల పెట్టుబడులు, 320 ఉద్యోగాలు
19.అపోలో టైర్స్ , తిరుపతి జిల్లా, శ్రీసిటీ రూ,6100 కోట్లు పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు
20.ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఫ్రాగ్రెన్సెస్ ఇఫ్కో సెజ్ నెల్లూరు, రూ.3153 కోట్ల పెట్టుబడులు, 172 మందికి ఉద్యోగాలు
21.రాయల్ ఎన్ ఫీల్డ్ , తిరుపతి జిల్లా, రూ.2508 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉద్యోగాలు
22.చెట్టినాడ్ సిమెంట్స్ , పలనాడు జిల్లా, రూ.1340 కోట్లు పెట్టుబడులు, 360 మందికి ఉద్యోగాలు
23.ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా కాకినాడ జిల్లా, రూ.171.52 కోట్ల పెట్టుబడులు, 102 మందికి ఉద్యోగాలు
24.ఐటీసీ లిమిటెడ్, గుంటూరు జిల్లా రూ.51.65 కోట్ల పెట్టుబడులు, 50 మందికి ఉద్యోగాలు
25.హ్యాంగ్యో ఐస్ క్రీమ్స్ తిరుపతి జిల్లా రూ.74.49 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు

# మళ్లీ ట్రంప్ బెదిరింపులు




"గతంలో మేం పెట్టిన షరతులకు తలొగ్గి ఇరాన్ ఆచరణసాధ్యమైన శాంతి ఒప్పంద ప్రతిపాదనలతో ముందుకొస్తోందని సమాచారమొచ్చింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులకు మేం ఆరంభించిన 'ఎపిక్ ఫ్యూరీ'సైనిక చర్య దాదాపు ముగింపుకొచ్చింది. అత్యంత ప్రభావవంతమైన మా దిగ్బంధం ధాటికి ఇప్పుడు హార్ముజ్ ఇరాన్ సహా అందరికీ అందుబాటులోకి రాబోతోంది. ఈ దిశలో ఇరాన్‌గనక మళ్లీ తోకజాడిస్తే బాంబుల వర్షం కురవడం ఖాయం. గతంలో ఎన్నడూలేనంతటి భీకరంగా బాంబులేస్తాం"అని ట్రంప్ తన సోషల్‌మీడియా మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. హార్ముజ్‌ను వీలైనంత త్వరగా తెరవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీకి బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సూచించిన నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటనచేయడం గమనార్హం. మరోవైపు ఒక పేజీకి సరిపడా షరతులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్, అమెరికాలు ఓవైపు ముందడుగేస్తున్నాయన్న వార్తలు వెలువడ్డాయి. మరోవైపు హార్మూజ్ గుండా వెళ్లే విదేశీ చమురునౌకలకు రక్షణగా తమ యుద్ధనౌకలను సాయంగా పంపే 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ఆపరేషన్‌ను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. త్వరలోనే ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# కోల్‌కతా సమీపంలో కాల్పులు..

## సువేందు అధికారి పీఏ హత్య





(పీఏ) చంద్రనాథ్ రథ్ గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో దారుణ హత్యకు గురయ్యారు. దోహారియా ప్రాంతంలో బుధవారం రాత్రి కారులో చంద్రనాథ్ రథ్ ప్రయాణిస్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. అత్యంత దగ్గర నుంచి జరిపిన కాల్పుల్లో రథ్‌తో పాటు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రథ్‌ను, డ్రైవర్‌ను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రథ్ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. దాడి జరిగిన వెంటనే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు నాలుగు రౌండ్ల కాల్పులు జరిపినట్లు తెలిసింది. ఈ సంఘటన బీజేపీకి చారిత్రాత్మక విజయాన్ని సాధించిన రెండు రోజులకే చోటు చేసుకోవడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. మధ్యంగ్రాం నియోజకవర్గంలో తృణమూల్ అభ్యర్థి రథిన్ ఘోష్, ఇతను బీజేపీకి గట్టి పోటీ ఇచ్చాడు. ఆయన 2,399 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే తరుణ్‌జ్యోతి తివారీ మాట్లాడుతూ, 'మేము నిరంతరం శాంతిని కోరుకుంటున్నాం, కానీ టీఎంసీ ఈ దారుణానికి ఒడిగట్టి అతిపెద్ద తప్పు చేసింది'.. అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఘటనా స్థలికి చేరుకున్న ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరగడంతో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నిందితులను గుర్తించేందుకు, హత్యకు గల కారణాలను విశ్లేషించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని సమాచారం. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ అనుచరులుగా నటిస్తూ హింసను ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇదే సమయంలో సువేందు అధికారి, భవానీపూర్ నియోజకవర్గంలో మమతా బెనర్జీని 15,000 పైగా ఓట్ల తేడాతో ఓడించి 'జెయింట్ కిల్లర్' అనే పేరును సంపాదించారు. దాంతో సువేందు అధికారిని ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారుగా భావిస్తున్నారు.

# రైతు చేతుల్లో దండన తప్పదు



ఈకబురు, వరంగల్: రాహుల్‌గాంధీ సహా ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రులు రైతు డిక్లరేషన్ పేరిట 34 హామీలిచ్చి.. అమలు చేయకుండా రైతులను మోసగించారని.. కనీసం కల్లాల్లో పంటలను కొనుగోలు చేయకుండా గోస పెడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతులు ఓపిక పడతారని.. ఆ ఓపిక నశిస్తే ఉరికించటం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ నాలుగేళ్ల క్రితం మే 6న వరంగల్ కేంద్రంగా రైతు డిక్లరేషన్ సభ నిర్వహించింది. ఆ సభలో ఇచ్చిన హామీలను విస్మరించిందంటూ బుధవారం ఇక్కడ 'రైతు సంగ్రామ సదస్సు' పేరిట భారాస సభ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిపై, రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు అన్నదాతల చేతుల్లో దండన తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. దిల్లీకి కప్పం కడుతూ సీటును రెన్యువల్ చేసుకొనే సీఎం అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలో అయినా వందశాతం రుణమాఫీ అయినట్లు రైతులు చెబితే తాను దేనికైనా సిద్ధమంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో రైతుల ఖాతాల్లో టింగుటింగుమంటూ డబ్బు పడితే.. ఇప్పుడు ఆ డబ్బు రాహుల్ ఖాతాలో పడుతోందని ఆరోపించారు.

పథకాల్లో కోతలు.. ఎగవేతలు తప్ప. ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు విశ్రమించం. రైతులు, కౌలు రైతులను ఉద్ధరిస్తామని నాడు ఉద్దెర మాటలు చెప్పారు. రైతులకు కేసీఆర్ కంటే ఎక్కువ మేలు చేసినట్లు చూపిస్తే.. రాజకీయాల నుంచి వైదొలగటానికి సిద్ధం.

బడా భాయ్.. ఛోటా భాయ్..

సీఎం 69 సార్లు దిల్లీ పోయి.. 69 పైసలు కూడా తీసుకురాలేదు. యూరియాను యాప్‌లో కాదు.. కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి. పథకాలు అమలు చేయలేకపోతున్నారు. పైసలెక్కడికి పోతున్నాయో చెప్పాలి. దిల్లీలో బడా భాయ్ చెప్పినట్లు.. ఇక్కడ ఛోటా భాయ్ నడుచుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మీటర్ల బిగింపును కేసీఆర్ వ్యతిరేకిస్తే రేవంత్‌రెడ్డి అంగీకరించి సంతకం చేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది.

తాలు తీస్తే.. తోలు తీస్తాం...

కాంగ్రెస్ నేతలు ఏవీ వదలటం లేదు. ఇసుక, మట్టి, మైనింగ్, భూముల కబ్జాలు, కమీషన్లు.. ఇలా దండుపాళ్యం బ్యాచ్‌ను తలపించేలా దండుకుంటున్నారు. మేడారం సమ్మక్కసారలమ్మ గద్దెల అభివృద్ధి పనుల నిధుల్లో కమీషన్ కోసం ముగ్గురు మంత్రుల మధ్య పంచాయతీ తెలిసిందే. కాళేశ్వరం విషయం హైకోర్టు తీర్పుతో తేలిపోయింది. ఇంకా రూ.లక్ష కోట్ల అవినీతి అని మాట్లాడే వారికి తగిన బుద్ధిచెప్పాలి. మేడిగడ్డను కుట్రతో బాంబులు పెట్టి పేల్చారనే ప్రచారం ఉంది. ఇటీవల చెక్‌డ్యాంలను బాంబులతో పేల్చిన పరిస్థితి ఉంది. పంటల కొనుగోళ్లలో తాలు తీస్తే.. తోలు తీస్తాం" అని కేటీఆర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్దఎత్తున రైతులు, పార్టీ కార్యకర్తలు సభకు తరలివచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, రెడ్యానాయక్, పొన్నాల లక్ష్మయ్య, రాజయ్య, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, మాలోత్ కవిత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో 75% వృద్ధి: ఫాడా



దిల్లీ: ఏప్రిల్‌లో విద్యుత్ ప్యాసింజర్ వాహనాల (పీవీలు) అమ్మకాలు 75.1% పెరిగి 23,506 వాహనాలకు చేరాయి. కిందటేడాది ఇదే నెలలో 13,421 ఎలక్ట్రిక్ పీవీలను కంపెనీలు విక్రయించాయి. వాహన డీలర్ల సంఘాల సమాఖ్య ఫాడా విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

ఏప్రిల్‌లో ఎలక్ట్రిక్ పీవీల విక్రయాల్లో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ అమ్మకాలు 77.17% పెరిగి 8,543 వాహనాలుగా నమోదయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో 4,822 వాహనాలను విక్రయించింది.

మహీంద్రా అండ్ మహీంద్రా ఎలక్ట్రిక్ పీవీల విక్రయాలు 3,301 వాహనాల నుంచి 63.98% పెరిగి 5,413 వాహనాలకు చేరాయి.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా విక్రయాలు 5,006 వాహనాలు కాగా.. గతేడాది ఏప్రిల్‌లో విక్రయించిన 3,777 వాహనాలతో పోలిస్తే 32.54 శాతం పెరిగాయి.

ఏప్రిల్‌లో విద్యుత్ ద్విచక్ర వాహనాల మొత్తం విక్రయాలు 92,538 వాహనాల నుంచి 60.73 శాతం పెరిగి 1,48,740 వాహనాలకు చేరాయి.

అత్యధికంగా టీవీఎస్ మోటార్ 37,683 విద్యుత్ ద్విచక్ర వాహనాలను విక్రయించింది. 2025 ఏప్రిల్‌లో అమ్మిన 19,976 వాహనాలతో పోలిస్తే 88.64 శాతం పెరిగాయి.

బజాజ్ ఆటో విక్రయాలు 19,162 వాహనాల నుంచి 71.68 శాతం పెరిగి 32,898 వాహనాలకు చేరాయి. ఏథర్ ఎనర్జీ అమ్మకాలు 27,034 వాహనాలుగా నమోదయ్యాయి. కిందటేడాది ఏప్రిల్‌లో విక్రయించిన 13,332 వాహనాలతో పోలిస్తే 102.78 శాతం పెరిగాయి.

ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల అమ్మకాలు 3.3% పెరిగి 64,549కు చేరాయి. 2025 ఏప్రిల్‌లో 62,489 వాహనాలను విక్రయించాయి.

ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల విక్రయాలు కూడా 902 వాహనాల నుంచి రెండింతలకు పైగా పెరిగి 2,245 వాహనాలకు చేరాయి

## ఏఐ ఆధారిత యాంటీడ్రోన్ వ్యవస్థ




హైదరాబాద్: రక్షణ రంగ సంస్థ జెన్ టెక్నాలజీస్ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత యాంటీడ్రోన్ వ్యవస్థను ఆవిష్కరించింది. పెరుగుతున్న డ్రోన్ దాడుల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఈ సరికొత్త వ్యవస్థ 15 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న 100కు పైగా డ్రోన్లను ఒకేసారి పసిగట్టి, కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. దీన్ని సైన్యం తన అవసరాలకు తగ్గట్టు వాహనాలపై సులభంగా తమ వెంట తీసుకెళ్లేలా రూపొందించారు. శత్రు డ్రోన్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశామని జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి తెలిపారు. ఈ సరికొత్త ఆవిష్కరణ భారత సాయుధ దళాల భద్రతను పెంచడంతోపాటు, రక్షణ రంగంలో దేశ స్వావలంబనకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

## టీవీఎస్ ఐక్యూబ్‌లో కొత్త వేరియంట్



**దిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ తమ విద్యుత్ స్కూటర్ ఐక్యూబ్‌లో కొత్త వేరియంట్‌ను విడుదల చేసింది. ఇప్పటివరకు ఉన్న 3.5 కిలోవాట్ అవర్ మోడల్ స్థానంలో టీవీఎస్ ఐక్యూబ్ ఎస్ 4.7 కిలోవాట్ అవర్ రానుంది. ఈ స్కూటర్ ధర రూ.1,37,142 (ఎక్స్-షోరూమ్). ఇందులో అమర్చిన 4.7 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్.. 5.9 హెచ్‌పీ శక్తిని, 33 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. ఒకసారి ఛార్జింగ్‌తో 175 కి.మీ. ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. దీని గరిష్ఠ వేగం గంటకు 82 కి.మీ.. ఈ స్కూటర్ కేవలం 4.3 సెకన్లలోనే 0-40 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. పోర్టబుల్ ఛార్జర్‌తో 0 నుంచి 80% ఛార్జింగ్ కావడానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది. ఇందులో స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, నావిగేషన్ సపోర్ట్, రైడ్ అనలిటిక్స్, నోటిఫికేషన్స్, రివర్స్ మోడ్, క్రాష్ అలర్ట్, ఫాల్ అలర్ట్, యాంటీ థెఫ్ట్ అలర్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. మెగ్నిఫిసెన్స్ పర్పుల్ బీజ్, హార్లెక్విన్ బ్లూ బీజ్, టైటానియం గ్రే మ్యాట్ వంటి రంగుల్లో లభించనుంది.**

# భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం



భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా ఉప విదేశాంగ కార్యదర్శి క్రిస్టోఫర్ లాండౌ తెలిపారు. సంతకం చేయడానికి ఇరు దేశాలు చాలా దగ్గరగా ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు మిగిలింది ఒక చివరి అడ్డంకి మాత్రమే అని పేర్కొన్నారు. మేరీల్యాండ్‌లోని నేషనల్ హార్బర్ వద్ద జరిగిన సెలెక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లాండౌ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

'ఇప్పటికే చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందానికి తుది పరిష్కారం లభించడం చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. మేం చాలా దగ్గరగా ఉన్నామని అనుకుంటున్నా. కానీ మనం చివరి అడ్డంకిని అధిగమించాలి. అంతేకాకుండా అజెండాలోని ఇతర ముఖ్య అంశాలపై ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అయితే అది ఎప్పుడు జరుగుతుందనే దానిపై నా వద్ద పెద్దగా అంతర్గత సమాచారం ఏమీ లేదు. కానీ మనం చాలా దగ్గరగా ఉన్నామని నేను నమ్ముతున్నాన'ని లాండౌ పేర్కొన్నారు.

### ప్రపంచ వేదికపై భారత్ ప్రాధాన్యం

ఇటీవల చేసిన భారత్ పర్యటన గురించి లాండౌ గుర్తు చేసుకున్నారు. 'భారత్ ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోందని అనడంలో ఎటువంటి సందేహం లేదని భావిస్తున్నా. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం భారత్. అంతేకాకుండా భారత్‌కు ఆర్థికంగా అద్భుతమైన అపార అవకాశాలు ఉన్నాయి. గతంలో తీసుకున్న ఆర్థిక విధానాల కారణంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. కానీ ఇప్పుడు భారీ ఆర్థిక వృద్ధికి భారత్ సిద్ధంగా ఉంది. తద్వారా కోట్లాది మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేయడానికి సిద్ధంగా ఉంద'ని లాండౌ వ్యాఖ్యానించారు.

### ఖరారు దిశగా పురోగతి

కాగా, వాణిజ్య ఒప్పందంపై ఏప్రిల్ 20 నుంచి 22 వరకు వాషింగ్టన్ డీసీ వేదికగా భారత్, అమెరికా ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ చర్చలతో ముడిపడిన అంశాలపై అమెరికా సీనియర్ అధికారి ఒకరు ఏప్రిల్ 21న కీలక ప్రకటన చేశారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునే దిశగా భారత్, అమెరికాలు పురోగతిని సాధించాయని ఆయన వెల్లడించారు. ఇరుదేశాల ప్రతినిధులు సానుకూల వాతావరణంలో, ఫలవంతంగా చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ఈ చర్చల వివరాలు తెలిసిన మరో అమెరికన్ అధికారి మాట్లాడుతూ, వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చాలా కీలకమైన సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యాయని చెప్పారు. ఇరుపక్షాలు ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు దగ్గరలో ఉన్నాయన్నారు.

# భారత జీడీపీ వృద్ధి 6.6 శాతమే




దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.6 శాతానికి నెమ్మదించొచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ పేర్కొంది. ఇంతకు ముందు జీడీపీ వృద్ధిని 7.1 శాతంగా సంస్థ అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంధన, ఆహార భద్రత రంగాల్లో సంస్కరణలు అత్యంత కీలకమని తెలిపింది. 'ఇండియా ఫార్వర్డ్' పేరిట ఎస్ అండ్ పీ గ్లోబల్, క్రిసిల్ సంయుక్త నివేదికను వెలువరించాయి. ఇంధన సరఫరాలో అంతరాయాలు, పెరుగుతున్న చమురుగ్యాస్ ధరలు, రూపాయి విలువలో హెచ్చుతగ్గుల వల్ల భారత్ తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటోందని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త ధర్మకీర్తి జోషి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం ఇదే విధంగా కొనసాగితే శీతాకాలపు పంటలకు ఎరువుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏలు) ప్రయోజనాలను పొందాలంటే, భారత్ తన పోటీతత్వాన్ని పెంచుకోవడానికి మరిన్ని సంస్కరణలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచడం వల్ల వినియోగదారులపై నేరుగా ప్రభావం పడనప్పటికీ, దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగడం వల్ల టోకు ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదురైనప్పుడు వాడుకోవడానికి వీలుగా ఒక సమగ్రమైన 'ఎనర్జీ స్టోరేజ్ పాలసీ'ని రూపొందించుకోవాలని సూచించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భారత వృద్ధిపై కొంత ప్రభావం చూపుతోంది. అయినప్పటికీ దీర్ఘకాలిక లక్ష్యాల కోసం అంతర్గత సంస్కరణలు కొనసాగించాలని నివేదిక స్పష్టం చేసింది.

### 202627లో 0.6% తగ్గొచ్చు: ఏడీబీ

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో భారత జీడీపీ వృద్ధి 0.6 శాతం మేర తగ్గి 6.3 శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉందని ఏడీబీ ముఖ్య ఆర్థికవేత్త ఆల్బర్ట్ పార్క్ అంచనా వేశారు. చమురు, గ్యాస్ దిగుమతులపై భారత్ అధికంగా ఆధారపడినందున.. ద్రవ్యోల్బణం గణనీయంగా పెరగొచ్చని తెలిపారు. 2026 27లో ద్రవ్యోల్బణం 2.4 శాతం మేర పెరిగి 6.9 శాతానికి చేరుతుందని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పార్క్ చెప్పారు. అయితే వచ్చే ఏడాది వృద్ధిపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని, ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని తెలిపారు.

### భవిష్యత్ కుదుపులను సమర్థంగా తట్టుకునే స్థితిలో భారత్: మూడీస్

2020 నుంచి అత్యంత వేగంగా పుంజుకుంటున్న దిగ్గజ వర్ధమాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. విదేశీ మారకపు నిల్వలు గణనీయ స్థాయిలో ఉండటంతో... కరెన్సీ ఒడుదొడుకులు, అంతర్జాతీయ అనిశ్చితులను తట్టుకునేందుకు తోడ్పడుతున్నాయని పేర్కొంది. పరపతి విధాన నిర్ణయాలపై స్పష్టత, ద్రవ్యోల్బణ అంచనాలు స్థిరంగా ఉండటం, అవసరమైనప్పుడల్లా మారకపు రేట్లను సర్దుబాటు చేసుకోగలగడం వంటి కారణాల వల్ల భవిష్యత్ కుదుపులను సమర్థంగా ఎదుర్కొనే స్థితిలో భారత్ ఉందని పేర్కొంది. అయితే అధిక రుణ భారం, ద్రవ్యలోటు వల్ల వెంటవెంటనే కుదుపులు ఎదురైనప్పుడు ప్రతిస్పందించే అవకాశాలు పరిమితంగా ఉంటాయని వివరించింది.

# అమెరికాలో భారత కంపెనీల భారీ పెట్టుబడులు



దిల్లీ: అమెరికాలో సాంకేతికత, ఔషధ, తయారీ సహా వివిధ రంగాల్లో భారత కంపెనీలు 20.5 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1,95,000 కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టే యోచనలో ఉన్నాయని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. పెట్టుబడుల ప్రతిపాదనలను ప్రస్తావిస్తూ.. భారత్‌అమెరికా వ్యాపార సంబంధాల వల్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో అమెరికాలోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని వెల్లడించారు. కాగా... సెలెక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో 12 భారత కంపెనీలు 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు (రూ.10,000 కోట్లు) పెట్టనున్నట్లు ప్రకటించాయి. సెలెక్ట్ యూఎస్ఏలో ఒక గమ్యస్థానం నుంచి ఇప్పటివరకు వచ్చిన అత్యధిక పెట్టుబడుల ప్రతిపాదనలు ఇవే. మరోవైపు భారత్ కంపెనీల 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలో ఈ 12 కంపెనీలు ప్రకటించిన 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు కూడా భాగమేనని గోర్ తెలిపారు. ఈ పెట్టుబడుల భాగస్వామ్యాలు అమెరికా పౌరులకు ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా.. బలమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడతాయని వెల్లడించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి వ్యాపారాలు చేస్తే అందరూ విజేతలు కావొచ్చనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏరోస్పేస్, రక్షణ, ఇంధనం, కృత్రిమమేధ లాంటి రంగాల వ్యాప్తంగా ఈ పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని చెప్పారు.

ఏఐ డేటా కేంద్రాల తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు అమెరికాలో 100 మిలియన్ డాలర్లను స్టెర్‌లైట్ టెక్నాలజీస్ పెట్టుబడిగా పెట్టనుంది.

భారత ఔషధ రంగ కంపెనీలు అమెరికాలో 19.1 బి.డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నట్లు ప్రకటించాయి. న్యూ జెర్సీకి చెందిన ఆర్గాన్ అండ్ కో. కొనుగోలుకు సన్‌ఫార్మా 11.75 బి.డాలర్లను వెచ్చించే యోచనలో ఉంది.

ఒహాయో, టెక్సాస్‌లో ప్లాంట్ల వద్ద ప్రాజెక్టుల నవీకరణకు 255 మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టాలని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రణాళికగా పెట్టుకుంది.

అమెరికాలోని ఐదు రాష్ట్రాల్లో తయారీ క్లస్టర్ల ఏర్పాటు నిమిత్తం అహ్మదాబాద్‌కు చెందిన అభ్యుదయ్ గ్రూపు అత్యధికంగా 900 మిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. టెక్సాస్, మిసిసిపిలో 87 మిలియన్ డాలర్ల పెట్టుబడిని పీఆర్ జిందాల్ గ్రూపు పెట్టనుంది. జివో వెల్‌నెస్ గ్రూపు 15 మి.డాలర్లు, టెక్‌డోమ్ సొల్యూషన్స్ 7.5 మి.డాలర్లు, ఆట్రి ఏఐ 2 మి.డాలర్లు, మ్యాగ్నోఇన్నోవేషన్ ల్యాబ్ 2 మి.డాలర్లు, సటోరి ఎక్స్‌ఆర్ టీమ్ 1.5 మి.డాలర్లు, రోష్‌ఏఐ 5 మి.డాలర్లు, పాలీహోస్ ఇంక్ 2 మి.డాలర్లు, కిసోఫ్లో 2 మి.డాలర్లు చొప్పున పెట్టుబడులను ప్రకటించాయి. అమెరికా విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో పరిశోధన సహకారాన్ని పెంపొందించేందుకు కాలిఫోర్నియాలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ గ్లోబల్ రీసెర్చ్ ఫౌండేషన్ భావిస్తోంది. ఇందుకోసం 4.5 మిలియన్ డాలర్లను వెచ్చించనుంది.

## చివరి గంటలో కొనుగోళ్ల కళ



దేశీయ సూచీలు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెర దించేలా అమెరికా, ఇరాన్‌లు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న వార్తలు మార్కెట్‌లో ఉత్సాహానికి కారణమయ్యాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ ముడి చమురు ధర తగ్గడం కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 69 పైసలు లాభపడి 94.49 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 101.3 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్, జపాన్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లూ సానుకూలంగా కదలాడాయి.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.99 లక్షల కోట్లు పెరిగి, రూ.472.80 లక్షల కోట్ల (4.97 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 76,773.25 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసిన సూచీ, చివరి గంటలో లభించిన కొనుగోళ్లతో 78,022.78 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 298.15 పాయింట్లు పెరిగి 24,330.95 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,356.5023,997.90 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభపడ్డాయి. ఇండిగో 6.60%, ట్రెంట్ 3.91%, ఏషియన్ పెయింట్స్ 3.56%, ఎస్‌బీఐ 3.38%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.11%, ఎటర్నల్ 2.98%, యాక్సిస్ బ్యాంక్ 2.89%, ఎం అండ్ ఎం 2.75%, బజాజ్ ఫైనాన్స్ 2.32%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.31%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.24%, మారుతీ 2.19%, టాటా స్టీల్ 2.01% చొప్పున పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.80%, ఎల్ అండ్ టీ 1.18%, పవర్‌గ్రిడ్ 1.11%, ఎన్‌టీపీసీ 1%, హెచ్‌సీఎల్ టెక్ 0.97%, ఇన్ఫోసిస్ 0.88% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీలకొస్తే టెలికాం 2.94%, సేవలు 2.89%, పీఎస్‌యూ బ్యాంక్ 2.81%, స్థిరాస్తి 2.76%, బ్యాంకెక్స్ 2.64%, ప్రైవేట్ బ్యాంక్స్ 2.51%, ఆర్థిక సేవలు 2.47%, ఆరోగ్య సంరక్షణ 1.99% చొప్పున రాణించాయి. ఇంధన, ఎఫ్ఎంసీజీ, యుటిలిటీస్, విద్యుత్ రంగాలు డీలా పడ్డాయి.

## బంగారం... వాయిదా ఉంది!



సమంత ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' విడుదల వాయిదా పడింది. ఈ నెల 15న రావల్సిన ఈ సినిమాని జూన్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ సీజన్‌ని దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయాన్ని తీసుకొన్నట్టు స్పష్టం చేశాయి. నందినిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ట్రాలాలా పిక్చర్స్ పతాకంపై సమంత స్వయంగా నిర్మిస్తున్నారు.



## రాజసం ఉట్టిపడేలా భారతి

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "భారతి తన మాయాజాలంతో అందరినీ మంత్రముగ్ధులను చేయడానికి వస్తోంద"నే వ్యాఖ్యను జోడించింది. ఇందులో పౌరాణిక లుక్‌లో.. రాజసం ఉట్టిపడేలా కిరీటం, భారీ ఆభరణాలు ధరించి విభిన్నమైన అవతారంలో కనిపించి ఆకట్టుకుంది భాగ్యశ్రీ. నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 26న రాబోతుంది.

**గ్రామీణ యువతిగా మరో లుక్**

శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'సియోన్'. కమల్ హాసన్ తన సొంత బ్యానర్‌పై ఆర్. మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ పోస్టర్‌లో గ్రామీణ యువతిగా నుదుటన కుంకుమ, చేతిలో నెమలి ఈక పట్టుకొని సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించింది భాగ్యశ్రీ.

# అలాంటి పరిస్థితి ఏ మహిళకూ రాకూడదు





'నాకు త్వరగా పెళ్లి చేసేయండి నాన్నా...' అంటూ తెలుగు ప్రేక్షకులకు చేరువైన కథానాయిక లావణ్య త్రిపాఠి. నిజ జీవితంలో కథానాయకుడు వరుణ్‌తేజ్‌ని పెళ్లి చేసుకుని త్వరగానే స్థిరపడిపోయింది. ఆమె వివాహం తర్వాత చేసిన సినిమానే... 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆమె విలేకర్లతో ముచ్చటించారు.

**'సతీ లీలావతి' మీకు పునరాగమనం లాంటి సినిమా. ఈ కథలో మిమ్మల్ని మెప్పించిన విషయాలేవి?**

అందరూ ఆస్వాదించే హాస్యం ఉన్న ఈ కథే నాకు బాగా నచ్చింది. దర్శకుడు చెప్పిన విధానం కూడా అంతే నచ్చింది. వింటున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నా. కొన్ని చోట్ల భావోద్వేగాలూ ఉంటాయి. బలమైన సందేశం కూడా ఉన్నప్పటికీ, అది ఏదో బోధిస్తున్నట్టుగా కాకుండా అంతర్లీనంగా సున్నితంగా ఉంటుంది.

**ఇందులో లీలావతి పాత్రలో కనిపించారు కదా. ఆ పాత్రకీ, మీకూ మధ్య పోలికలేమైనా ఉన్నాయా?**

ఉన్నాయి కానీ, అవేమిటో చెప్పను (నవ్వుతూ). ఇందులో నేను లీలావతి అనే యువతిగా కనిపిస్తా. లీలా ఓ దర్శకురాలు. ఆమె వైవాహిక జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలు ఈ సినిమాలో కీలకం. ఇందులో చూపించినట్టుగా బయట ప్రపంచంలో బంధాలు ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకీ రాకూడదు. నాకు నా నిజ జీవితంలో వరుణ్‌లాంటి మంచి భర్త దొరికారు. లీలాకి ఎలాంటి భర్త దొరికాడు? అతన్ని లీలా ఏం చేసిందన్నది తెరపైనే చూడాలి.

**ఈ సినిమా చేస్తున్నప్పుడు మీరు గర్భంతో ఉన్నారట కదా. చిత్రీకరణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి?**

నేను చేసిన అత్యంత కష్టమైన సినిమా, చాలా సులభమైన సినిమా ఇదే. కష్టంగా అనిపించడానికి కారణం నేను గర్భవతిగా ఉంటూ చిత్రీకరణలో పాల్గొనడం. సులభమైన సినిమా ఎందుకంటే చాలా ఆడుతూ పాడుతూ సాగే పాత్ర. ఈ సినిమా చేస్తున్నప్పుడు నేను గర్భం దాల్చిన విషయం వరుణ్‌కి మాత్రమే తెలుసు. అప్పటికే నేను బరువు తగ్గాను. ఆ దశలో చిత్రీకరణ సులభం కాదని అర్థమైంది. కానీ ఆ శక్తి నాకు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు, అప్పుడు నా కడుపులో ఉన్న మా బాబు 'అమ్మా, నువ్వు చేయగలవు' అని నన్ను ప్రోత్సహించాడో ఏమో నేను చాలా ధైర్యంగా సెట్‌కి వెళ్లా. నా కెరీర్‌లో తొలిసారి ఈ సినిమాకోసం యాక్షన్ సన్నివేశాలూ చేయాల్సి వచ్చింది.

**పెళ్లి తర్వాత కథల ఎంపిక విషయంలో మీ ఆలోచనలు ఏమైనా మారాయా?**

అలాంటిదేమీ లేదు కానీ, నేనే కొత్తగా సినిమాల్ని ఒప్పుకోవడం లేదు. కుటుంబానికి సమయం కేటాయించడం కోసం మరికాస్త విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నా. మా అబ్బాయిని చూసుకోవడానికే నాకు సమయం సరిపోతోంది. అయితే నాకు ఇష్టమైన హారర్ కథలు, సరదా కథలు మరిన్ని చేయాలనే ఆలోచనలైతే ఉన్నాయి. వరుణ్‌తోనూ మళ్లీ కలిసి నటించాలని ఉంది. అయితే ఈమధ్య మా నిజ జీవితాన్ని పోలిన కథే ఒకటి వచ్చింది. తెరపైనా అవే పాత్రలు చేస్తే కొత్తదనం ఏం ఉంటుంది? అందుకే భవిష్యత్తులో విభిన్నమైన కథలేమైనా వస్తే కచ్చితంగా కలిసి

## న్యాయం దేవుడి లాంటిది.. వెతికి పట్టుకోవడం కష్టం!

నేహా రాజవంశ్... ఓ ఉన్నత స్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్. సాధారణ జీవితం గడిపే స్టెనోగ్రాఫర్ సారిక. ఈ ఇద్దరి మహిళల సామాజిక నేపథ్యాలు పూర్తిగా భిన్నమైనా.. లక్ష్యం మాత్రం ఒక్కటే. ఇంతకీ వారి లక్ష్యమేంటి? న్యాయం కోసం భిన్న మార్గాల్లో పోరాడుతున్న ఈ ఇద్దరి మహిళల కథేంటో తెలుసుకోవాలంటే 'సిస్టమ్' సినిమా చూడాల్సిందే. కథానాయిక జ్యోతిక, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటించారు. అశ్విని అయ్యర్ తివారీ దర్శకత్వం వహించారు. "న్యాయం దేవుడి లాంటిది.. వెతికి పట్టుకోవడం కష్టం" అంటూ ఈ మధ్యే విడుదలైన ఓ వీడియో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తాజాగా 'న్యాయం అంటే ఏంటి' అనే వ్యాఖ్యతో దీన్ని ఈ నెల 22న అమెజాన్ ప్రైమ్‌లో విడుదల చేయబోతున్నట్లు ఇన్‌స్టా వేదికగా ప్రకటించింది చిత్రబృందం. అన్యాయం, ఆశయం, అధికారం లాంటి అంశాల చుట్టూ తిరిగే ఈ కథలో అశుతోష్ గోవారికర్, గౌరవ్ పాండే తదితరులు నటించారు. బవేజా స్టూడియోస్ నిర్మించింది.



## నితిన్ కొత్త చిత్రం ప్రారంభం



కొంత విరామం తర్వాత కథానాయకుడు నితిన్ కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాణంలో... నారి సిరిసవాడ, సోమశేఖర్.టి దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో నితిన్ సరసన రితికా నాయక్ నటిస్తున్నారు. ప్రతిభ కలిగిన నటీనటులు, సాంకేతిక బృందం కలిసి చేస్తున్న ఈ సినిమాపై అందరిలోనూ ప్రత్యేకమైన ఆసక్తి నెలకొందని, ఈ నెల రెండో వారం నుంచే చిత్రీకరణని ప్రారంభిస్తామని సినీ వర్గాలు చెప్పాయి.

## నిజమైన ధైర్యానికి నిశ్శబ్దమెక్కువ!

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'భారత్ భాగ్య విధాత'. బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తుంది.స్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'భారత్ భాగ్య విధాత'. బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తుంది. మనోజ్ తపాడియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కంగన. "సాధారణ వ్యక్తుల అసాధారణ గాథ. భయం కంటే మానవత్వమే ఎత్తుగా నిలిచిన ఆ రాత్రి కథ. భారతదేశపు నిజమైన వీరుల అప్రకటిత గాథ.. 'భారత్ భాగ్య విధాత' జూన్ 12న థియేటర్లలోకి రాబోతుంద"నే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ సందర్భంగా కంగన మాట్లాడుతూ.. "నిజమైన ధైర్యం చాలా నిశ్శబ్దంగా ఉంటుంది. అది రంగంలోకి దిగి.. చేయవలసిన పనిని చేస్తుంది. ఉగ్రవాదానికి, ప్రాణాలకి మధ్య నిలబడిన సామాన్య ప్రజల ధైర్యం గురించే ఈ కథ. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు గర్వంగా ఉంద"ని చెప్పుకొచ్చింది. ఇందులో ఆమె నర్స్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.



## తొలిసారి సెట్‌లో అసౌకర్యానికి గురయ్యా



వినోదం కోసం చాలా సినిమాలు వస్తుంటాయి. కొన్నేమో సందేశాల కోసం తీస్తుంటా. వినోదం తోపాటు, బలమైన సందేశం ఇచ్చే సినిమా ఇది. ఆ సందేశం మంచిదైతే కాదు, కానీ అది ప్రతి ఒక్కరికీ చేరువ కావాలి. ఇలాంటి సినిమాల్ని చాలామంది దూరం పెట్టాలనుకుంటారు. కానీ వీటిని చూడాల్సిన సమయం, వీటి నుంచి నేర్చుకోవల్సిన సమయం ఇప్పుడొచ్చింది" అన్నారు కథానాయిక అవికాగోర్. ఆమె, కథానాయకుడు నందు జంటగా నటించిన చిత్రమే 'అగ్లీ స్టోరీ'. ప్రణవ స్వరూప్ దర్శకత్వం వహించారు. సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు సాగర్ కే చంద్ర విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి ప్రేమకి ఓ చీకటి కోణం ఉంటుంది. ఆ సత్యాన్ని బలంగా చెప్పడమే మా లక్ష్యం. నందు, అవికా నటన ఈ చిత్రానికి బలం చేకూర్చింద"న్నారు. నందు మాట్లాడుతూ తాను ఓ సవాల్‌తో కూడిన పాత్రని ఇందులో చేశానని చెప్పారు. అవికాగోర్ మాట్లాడుతూ "నా కెరీర్‌లో తొలిసారి సెట్‌లో ఎంతో అసౌకర్యంగా అనిపించింది ఈ సినిమా చేస్తున్నప్పుడే. ఇందులోని పాత్రలే అందుకు కారణం. ఎక్కడో ఎవరో ఇలాంటి బాధని ఎదుర్కొంటున్నారని గుర్తు చేస్తూ నాకు చాలా బాధ కలిగించింది ఇందులోని పాత్ర. ప్రేక్షకులు వాస్తవాల్ని తెలుసుకునే సమయం వచ్చేసింది" అన్నారు.

## హార్దిక్ ఆడతాడా? లేదా?



ముంబయి: ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య.. తర్వాతి మ్యాచ్ ఆడడంపై సందిగ్ధత నెలకొంది. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ కోసం రాయ్‌పుర్ బయలుదేరిన ముంబయి జట్టుతో పాటు హార్దిక్ ప్రయాణించకపోవడం చర్చనీయాంశమైంది. సోమవారం లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌లో హార్దిక్ వెన్నునొప్పి కారణంగా దూరమైనట్లు సూర్యకుమార్ తెలిపాడు. కానీ మ్యాచ్ అనంతరం ఆ జట్టు ఓపెనర్ రికెల్టన్ మాట్లాడుతూ హార్దిక్ గాయం తీవ్రత గురించి పూర్తిగా తెలియదని వ్యాఖ్యానించడం పలు అనుమానాలకు దారి తీసింది. దీంతో కెప్టెన్ తర్వాతి మ్యాచ్‌ల్లో ఆడతాడా లేదా అనే దానిపై గందరగోళం నెలకొంది. అయితే రవాణా ఇబ్బందుల వల్ల హార్దిక్ రాయ్‌పుర్ వెళ్లలేదని, ఆర్సీబీతో మ్యాచ్‌కు ఇంకా సమయం ఉండడంతో అతడు త్వరలోనే జట్టుతో కలుస్తాడని కొందరంటున్నారు. మరి హార్దిక్ తర్వాతి మ్యాచ్ ఆడతాడా లేదా అన్నది చూడాలి.

**సూర్య కూడా...** మరోవైపు తర్వాతి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ఆడడం అనుమానంగా ఉంది. హార్దిక్ మాత్రమే కాక.. అతడు కూడా ముంబయి జట్టుతో పాటు రాయ్‌పుర్‌కు వెళ్లలేదు. హార్దిక్ అందుబాటులో లేని సమయంలో తాత్కాలిక సారథిగా వ్యవహరించిన సూర్య.. వ్యక్తిగత కారణాలతో ఆర్సీబీతో మ్యాచ్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది.

## సిందరోవ్‌పై గుకేశ్ విజయం



వార్సా (పోలెండ్): గ్రాండ్ చెస్ సూపర్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో గత మ్యాచ్‌లో ఓడిన ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్.. పుంజుకున్నాడు. వచ్చే ఏడాది ప్రపంచ ఛాంపియనషిప్ కోసం తనతో తలపడబోయే జవోకిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై అయిదో రౌండ్లో విజయం సాధించాడు. గుకేశ్ ఎత్తుకు పైఎత్తు వేసి సిందరోవ్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఇంకా నాలుగు ర్యాపిడ్, 18 బ్లిట్జ్ గేమ్‌లు ఉన్న ఈ టోర్నీలో గుకేశ్ 5 పాయింట్లతో కొనసాగుతున్నాడు.

## పంత్ ఐపీఎల్ రికార్డు ఆశ్చర్యకరం



ముంబయి: టెస్టుల్లో ఎంతో దూకుడుగా ఆడే పంత్.. అదే ప్రదర్శనను ఐపీఎల్‌లో ప్రతిబింబించ లేకపోవడంపై టీమ్ఇండియా మాజీ బ్యాటర్ చతేశ్వర్ పుజారా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ''టెస్టుల్లో ఎలాంటి బౌలర్‌పైనైనా ఎదురుదాడికి దిగే పంత్ లాంటి బ్యాటర్ ఐపీఎల్ గణాంకాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఆ గణాంకాలు టెస్టుల్లో ఉన్నంత గొప్పగా లేవు. పంత్ లాంటి నాణ్యమైన బ్యాటర్ మూడు ఫార్మాట్లలోనూ ఆడగలడని నేను ఇప్పటికీ అనుకుంటున్నా. టీ20 క్రికెట్లో అతడి రికార్డు ఇంకా మెరుగ్గా ఉండాల్సింది'' అని పుజారా అన్నాడు. సాంకేతికంగా పంత్ బ్యాటింగ్‌లో మార్పులేమీ అవసరం లేదని, ఆలోచనల్లో స్పష్టత అవసరమని.. ఆఫ్‌సైడ్ షాట్లు కూడా మెరుగుపరుచుకుంటే మంచిదని అతను అభిప్రాయపడ్డాడు. ఇప్పటివరకు 134 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన పంత్.. 146 స్ట్రైక్‌రేట్‌తో 3757 పరుగులు చేశాడు. ఇందులో 20 అర్ధశతకాలు ఉన్నాయి. 49 టెస్టుల్లో 8 శతకాలు, 18 అర్ధశతకాలతో 3476 పరుగులు సాధించాడు. సగటు 42.91. లఖ్‌నవూకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోన్న పంత్.. ఈ సీజన్లో 9 మ్యాచ్‌ల్లో 25.5 సగటుతో 201 పరుగులే చేశాడు.

## కర్ణాటక సంఘం నిరాశ



ఐపీఎల్ ఫైనల్‌ను బెంగళూరు నుంచి తరలించడంపై కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) నిరాశను వ్యక్తం చేసింది ''ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌లను ఇతర వేదికలకు కేటాయించడం కేఎస్‌సీఏకు నిరాశను కలిగించింది. కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్.. బీసీసీఐతో మాట్లాడాడు. చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌ల నిర్వహణకు సన్నద్ధంగా, ఆసక్తిగా ఉన్నామని చెప్పాడు'' అని కేఎస్‌సీఏ ప్రతినిధి మృత్యుంజయ చెప్పాడు. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లను తరలించడానికి కారణాలను బీసీసీఐ ఇంకా తమకు చెప్పలేదని అన్నాడు. ఈ సీజన్‌లో చిన్నస్వామిలో మ్యాచ్‌లను చక్కగా నిర్వహించిందుకు చాలామంది అభినందించారని అతడు చెప్పాడు.

# టాప్ లేపిన సన్‌రైజర్స్

**ఐపీఎల్-19లో ఏడో విజయంతో అగ్రస్థానానికి**

**పంజాబ్‌కు హ్యాట్రిక్ ఓటమి**

**సన్‌రైజర్స్ హైదరాబాద్ దుమ్మురేపింది. సొంతగడ్డపై అదిరే బ్యాటింగ్.. సూపర్ బౌలింగ్.. చక్కటి ఫీల్డింగ్‌తో పంజాబ్ కింగ్స్‌పై పంజా విసిరింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. సొంతగడ్డపై నాలుగో విజయం, మొత్తంగా సీజన్‌లో ఏడో గెలుపుతో 14 పాయింట్లు సాధించిన ఆ జట్టు పేఆఫ్స్ బెర్తుకు చేరువైంది. మొదటి ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన పంజాబ్‌కు వరుసగా ఇది మూడో ఓటమి. ఈ మ్యాచ్ మొత్తంలో కూపర్ కనోలీ సెంచరీ ఒక్కటే పంజాబ్‌కు సానుకూలాంశం.**

సొంతగడ్డపై సన్‌రైజర్స్ అదరగొట్టింది. గత మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న కమిన్స్ సేన ఆల్‌రౌండ్ ఆటతో సత్తాచాటింది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఇషాన్ కిషన్ (55; 32 బంతుల్లో 2×4, 4×6), హెన్రిచ్ క్లాసెన్ (69; 43 బంతుల్లో 3×4, 4×6) అర్ధ సెంచరీలకు.. అభిషేక్ శర్మ (35; 13 బంతుల్లో 2×4, 4×6), ట్రావిస్ హెడ్ (38; 19 బంతుల్లో 3×4, 3×6), నితీశ్‌కుమార్‌రెడ్డి (29 నాటౌట్; 13 బంతుల్లో 2×4, 2×6) మెరుపులు తోడవడంతో మొదట సన్‌రైజర్స్ 4 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఆతిథ్య జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ ముందు పంజాబ్ తేలిపోయింది. 7 వికెట్లకు 202 పరుగులు చేయగలిగింది. ఒంటరి పోరాటం చేసిన కూపర్ కనోలీ (107 నాటౌట్; 59 బంతుల్లో 7×4, 8×6) శతకంతో అజేయంగా నిలిచాడు.



**ఆరంభంలోనే తేలిపోయింది:**

దిల్లీ క్యాపిటల్స్‌పై 265 పరుగుల లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన పంజాబ్.. స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే 236 పరుగుల భారీ లక్ష్యం కష్టమేమీ కాదు. అయితే గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన పంజాబ్.. స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయింది. పదునైన బౌలింగ్.. మెరుగైన ఫీల్డింగ్‌తో సన్‌రైజర్స్ తమ ప్రణాళికల్ని పక్కాగా అమలు చేసింది. పంజాబ్ ఫీల్డర్ల మాదిరిగా సన్‌రైజర్స్ మైదానంలో తప్పులు చేయకపోవడంతో ఆ జట్టుకు మొదటి ఓవర్లోనే కష్టాలు మొదలయ్యాయి. తొలి ఓవర్ చివరి బంతికి ప్రియాంశ్ ఆర్య (1).. రెండో ఓవర్ మొదటి డెలివరీకి ప్రభ్‌సిమ్రన్‌సింగ్ (3) పెవిలియన్ బాటపట్టడంతో పంజాబ్ కోలుకోలేకపోయింది. భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్లిద్దరూ మొదటి ఏడు బంతుల్లోనే ఔటవడం పంజాబ్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో పంజాబ్స్ ఓటమి ఖాయమైపోయింది. కమిన్స్ (2/34), నితీశ్ (1/11), ఇషాన్ మలింగ (1/36) మొదటి నాలుగు ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టడంతో మ్యాచ్ సన్‌రైజర్స్ వైపు మొగ్గింది. మార్కస్ స్టాయినిస్ (28; 14 బంతుల్లో 3×4, 2×6) బ్యాట్ ఝుళిపించినా.. అదీ కొద్దిసేపే. అతడిని స్పిన్నర్ శివాంగ్‌కుమార్ (2/45) బోల్తా కొట్టించాడు. అయితే ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో కనోలీ చెలరేగాడు. సూర్యాంశ్ షెడ్గే (25; 17 బంతుల్లో 1×4, 2×6) అతడికి కాసేపు సహకరించాడు. కానీ షెడ్గే ఔటయ్యాక పంజాబ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. కానీ కనోలీ చివరి వరకు ధాటిని కొనసాగించి సెంచరీ పూర్తి చేశాడు. ఓటమి అంతరాన్నీ తగ్గించాడు.

**సన్‌రైజర్స్ పరుగుల పంట....**

మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. ఉప్పల్‌లో తమకు అచ్చొచ్చిన పిచ్‌పై పరుగుల పంట పండించుకుంది. ఫ్లాట్ పిచ్.. పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో బ్యాటర్లు రెచ్చిపోయారు. పంజాబ్ ఫీల్డర్ల వైఫల్యాలు కూడా తోడవడంతో మరింతగా చెలరేగారు. అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ రెండో బంతికే సిక్సర్‌తో ఖాతా తెరిచిన అభిషేక్ (35; 13 బంతుల్లో 2×4, 4×6).. యాన్సెన్ బౌలింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. అభిషేక్ నుంచి స్ఫూర్తి పొందిన ట్రావిస్ హెడ్ (38; 19 బంతుల్లో 3×4, 3×6) కూడా బ్యాట్‌కు పని చెప్పాడు. అర్ష్‌దీప్ ఓవర్లో రెండు సిక్సర్లు, ఒక బౌండరీతో 16 పరుగులు సాధించాడు. ఫెర్గూసన్ (1/41) బౌలింగ్‌లో భారీషాట్‌కు ప్రయత్నించిన అభిషేక్.. శ్రేయస్ అయ్యర్ చేతికి చిక్కినా, సన్‌రైజర్స్ జోరు ఆగలేదు. పవర్ ప్లేలో 79/1తో పటిష్ఠ స్థితిలో నిలిచిన సన్‌రైజర్స్.. 8.1 ఓవర్లలో 100 పరుగుల మైలురాయిని అందుకుంది. పంజాబ్ చెత్త ఫీల్డింగ్ సన్‌రైజర్స్‌కు బాగా కలిసొచ్చింది. ఇషాన్ మూడుసార్లు (9, 18, 20 వ్యక్తిగత స్కోర్ల వద్ద) ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కనోలీ, ఫెర్గూసన్ సులువైన క్యాచ్‌లను నేలపాలు చేయగా.. ప్రభ్‌సిమ్రన్ స్టంపింగ్ అవకాశాన్ని వదిలేశాడు. క్లాసెన్ 9 పరుగుల వద్ద ఉన్నప్పుడు చాహల్ బౌలింగ్‌లో శశాంక్‌సింగ్ సునాయాస క్యాచ్‌ను విడిచిపెట్టాడు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఇషాన్, క్లాసెన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఇషాన్ 28 బంతుల్లో.. క్లాసెన్ 32 డెలివరీలలో అర్ధసెంచరీలు సాధించారు. 17.1 ఓవర్లలోనే సన్‌రైజర్స్ 200 పరుగులకు చేరుకుంది. 250 స్కోరు ఖాయమనుకున్న సమయంలో ఫెర్గూసన్, అర్ష్‌దీప్, వైశాక్ చివరి మూడు ఓవర్లలో కట్టుదిట్టంగా బంతులేయడంతో సన్‌రైజర్స్ అనుకున్న దాని కంటే తక్కువ స్కోరే చేసింది. వైశాక్ చివరి ఓవర్లో ఆఖరి బంతికి ముందు స్టేడియంలో ఒక ఫ్లడ్‌లైట్ నిలిచిపోవడంతో ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. అప్పటికే ఆ ఓవర్లో సిక్సర్, ఫోర్ కొట్టిన క్లాసెన్.. చివరి బంతికి క్యాచౌట్ అయ్యాడు.



**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** అభిషేక్ (సి) శ్రేయస్ (బి) ఫెర్గూసన్ 35; హెడ్ (సి) యాన్సెన్ (బి) చాహల్ 38; ఇషాన్ (సి) సూర్యాంశ్ (బి) అర్ష్‌దీప్ 55; క్లాసెన్ (సి) యాన్సెన్ (బి) వైశాక్ 69; నితీశ్ 29 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235; వికెట్ల పతనం: 154, 284, 3172, 4235; బౌలింగ్: అర్ష్‌దీప్ 40431; యాన్సెన్ 40610; ఫెర్గూసన్ 4-0-41-1; చాహల్ 4-0-32-1; విజయ్‌కుమార్ వైశాక్ 4-0-54-1

**పంజాబ్ ఇన్నింగ్స్:** ప్రియాంశ్ ఆర్య (సి) మలింగ (బి) కమిన్స్ 1; ప్రభ్‌సిమ్రన్ (సి) కమిన్స్ (బి) నితీశ్‌కుమార్ 3; కనోలీ నాటౌట్ 107; శ్రేయస్ (సి) కమిన్స్ (బి) మలింగ 5; స్టాయినిస్ (సి) ఇషాన్ (బి) శివాంగ్ 28; సూర్యాంశ్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 25; శశాంక్ (సి) నితీశ్ (బి) సకిబ్ 4; యాన్సెన్ (సి) హర్ష్ దూబె (బి) శివాంగ్ 19; వైశాక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 202; వికెట్ల పతనం: 14, 24, 323, 463, 5110, 6119, 7187; బౌలింగ్: కమిన్స్ 40342; నితీశ్‌కుమార్ 2-0-11-1; మలింగ 40361; సకిబ్ 4-0-40-1; శివాంగ్ 4-0-45-2; హర్ష్ దూబె 2-0-36-0

## తెలంగాణ క్రికెట్ లీగ్‌కు బీసీసీఐ ఆమోదం

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరగనున్న తెలంగాణ క్రికెట్ లీగ్ టీజీ20కి బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఇందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియాకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. టీజీ20 లీగ్‌ను అత్యున్నత ప్రమాణాలతో, పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నాడు. తెలంగాణలోని యువ ప్రతిభావంతులకు సరైన అవకాశాలు కల్పించడం, వెలుగులోకి తీసుకు రావడమే ఈ లీగ్ లక్ష్యమని తెలిపాడు. ఫ్రాంచైజీలు, ఆటగాళ్ల రిజిస్ట్రేషన్, షెడ్యూలు తదితర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## భారత్‌కు 27 పతకాలు ఖాయం

తాష్కెంట్: 2026 ఆసియా యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. అండర్15 అమ్మాయిల విభాగంలో 14, అబ్బాయిల విభాగంలో 13 పతకాలు ఖాయం అయ్యాయి. అశోక్ కుమార్ (37 కేజీలు), పర్శాంత్ (49).. యూఏఈకి చెందిన అల్బనై, అల్యామహిలను చిత్తు చేశారు. నితిన్ (40).. మెంగ్డిబే (కజకిస్థాన్)పై, హర్షవర్ధన్ (55).. ఫాజిలోవ్ (తజకిస్థాన్)పై దూకుడైన ఆటతో విజయం సాధించారు. యశ్ కుమార్ (33), రోహిత్ (35) బలమైన ప్రత్యర్థులను ఓడించారు. సమీర్ (43), ఒయినా (46), యాసిర్ (58) కూడా గెలిచారు.

## ఆ నిషేధం కొనసాగుతుంది

దిల్లీ: పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలపై నిషేధం కొనసాగుతుందని భారత క్రీడా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే బహుళ దేశాల ఈవెంట్ల కోసం ఆ దేశ అథ్లెట్లు ఇక్కడికి రాకుండా అడ్డుకోమని తెలిపింది. క్రీడాకారులు, జట్టు అధికారులు, సాంకేతిక సిబ్బంది, అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల ఆఫీస్ బేరర్ల వీసా ప్రక్రియ సరళతరం చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పింది. ఈ మేరకు క్రీడా శాఖ.. అన్ని జాతీయ క్రీడా సమాఖ్యలు, భారత ఒలింపిక్ సంఘం, భారత క్రీడా ప్రాధికార సంస్థకు సర్క్యులర్ పంపింది.

## ఐపీఎల్ ఫైనల్ అహ్మదాబాద్‌లో..

దిల్లీ: వరుసగా రెండో ఏడాది అహ్మదాబాద్‌లోనే ఐపీఎల్ ఫైనల్ జరగనుంది. మే 31న జరిగే మ్యాచ్‌కు ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. బీసీసీఐ బుధవారం ప్లేఆఫ్స్ షెడ్యూలును ప్రకటించింది. ధర్మశాలకు క్వాలిఫయర్ 1ను కేటాయించారు. మిగతా రెండు ప్లేఆఫ్స్‌కు న్యూ చండీగఢ్ ఆతిథ్యమిస్తుంది. సంప్రదాయం ప్రకారం ఐపీఎల్ ఫైనల్ డిఫెండింగ్ ఛాంపియన్ సొంతగడ్డపై నిర్వహించాలి. కానీ స్థానిక సంఘం, అధికారుల నుంచి కొన్ని డిమాండ్లు వచ్చాయని.. వాటిని నెరవేర్చడం తమ నియమాలకు విరుద్ధమని చెబుతూ బీసీసీఐ.. బెంగళూరుకు ఫైనల్‌ను కేటాయించలేదు. అందుకే వేదిక మారుస్తున్నట్లు పేర్కొంది. క్వాలిఫయర్ 1 ఈ నెల 26న ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో జరుగుతుంది. ధర్మశాలలో ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్ జరగనుండడం ఇదే తొలిసారి. ఎలిమినేటర్ (మే 27), క్వాలిఫయర్ 2 (మే 29)కు న్యూ చండీగఢ్‌లోని న్యూ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదిక. ఎక్కువ మంది ప్రేక్షకులు చూసే వీలు ఉండడం వల్లే ఫైనల్‌ను అహ్మదాబాద్‌కు మార్చినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీకి మూడు చొప్పున టికెట్లు ఇవ్వాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీసీఐ అంగీకరించలేదని తెలుస్తోంది.

## ప్రిక్వార్టర్స్ కు జ్యోతి సురేఖ



షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతిసురేఖ ప్రిక్వార్టర్స్‌కు చేరింది. ఆమె 150145తో యునుసోవా (కజకిస్థాన్)పై నెగ్గింది. జ్యోతితో పాటు ఇంకో ముగ్గురు భారత క్రీడాకారిణులు ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మధుర 148147తో వాంగ్ యు (చైనా), ప్రగతి 143142తో మాడెలీన్ (సింగపూర్)పై, ప్రపంచ మాజీ ఛాంపియన్ అదితి 147143తో ఇసాబెల్లా (బ్రిటన్)పై విజయం సాధించారు. పురుషుల వ్యక్తిగత విభాగాల్లోనూ అభిషేక్, సాహిల్, కుశాల్, ఓజాస్ కూడా ప్రిక్వార్టర్స్ చేరారు. అయితే కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత అమ్మాయిలు నిరాశ పరిచారు. జ్యోతి, ప్రగతి, ఆదితి త్రయం 227233తో తుర్కియే చేతిలో పరాజయం పాలైంది. చైనాతో కాంస్య పతక పోరులో భారత పురుషుల జట్టు ఓటమి పాలైంది. నిర్ణీత సమయంలో 234234తో స్కోర్లు సమం కాగా.. షూటౌట్‌లో చైనా గెలిచింది. రికర్వ్ మహిళల వ్యక్తిగత క్వాలిఫయింగ్ రౌండ్లో అంకిత భకత్ 652 పాయింట్లతో టాప్10లో నిలిచి పతక రౌండ్‌కు అర్హత సాధించింది. మొహౌద్ (651) 11, దీపిక కుమారి (651) 14, సిమర్జీత్ (648) 15 స్థానాలకు పరిమితమయ్యారు. పురుషుల్లో ధీరజ్ (679) ఏడో స్థానంతో క్వాలిఫయింగ్ రౌండ్ దాటాడు.